నమస్తే తెలంగాణ

నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 11 మార్చి 2025 | NIZAMABAD





# రోడ్డెక్కిన పసుపు రైతు



గిట్టుబాటు ధర దక్కడంలేదని అధికారులకు వివరిస్తున్న ఓ రైతు

## గిట్టుబాటు కోసం పోరుబాట

- దళారుల దోపిడీతో అన్నదాత కుదేలు
- నాణ్యత పేరుతో ధర తెగ్గోస్తున్న వ్యాపారులు
- మెరుపు ధర్నాకు దిగిన పసుపు రైతులు
- నిజామాబాద్ బస్టాండ్ ఎదుట బైఠాయింపు
- అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం
- అదనపు కలెక్టర్ హామీతో శాంతించిన రైతులు

కంఠేశ్వర్, మార్చి 10: దళారుల దోపిడీతో కుదేలవుతున్న పసుపు రైతులు రోడ్డెక్కారు. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగా రు. సోమవారం నిజామాబాద్ మార్కెట్ యార్డు నుంచి వందలాది మంది కర్షకులు ర్యాలీగా వచ్చి బస్టాండ్ ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. పసుపుబోర్డు అని చెప్పి ఒకరు మోసం చేస్తే, మద్దతు ధర పేరు చెప్పి మరొకరు దగా చేశారని మండిపడ్డారు. దళారులు దగా చేస్తున్నారని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. రెండు గంటలకు పైగా బైఠాయించడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచి పోయింది. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ వచ్చి నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

**కడుపు మండిన రైతులు..**

నాణ్యత పేరుతో ధర తగ్గిస్తుండడం, మార్కెట్‌లో వందలాది పసుపు కుప్పలుంటే ఒకటి, రెండింటికి మాత్రమే ధర కోట్ చేసి, మిగతా వాటికి వేయకపోవడంతో కడుపు మండిన అన్నదాతలు సోమవారం ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డు కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా వచ్చి బస్టాండ్ ఎదుట బైఠాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్కెట్ యార్డు మొత్తం దళారులు, వ్యాపారుల చేతిలో ఉన్నదని, రైతు ల గురించి ఆలోచించే వారు ఒక్కరూ లేరని వాపోయారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడ్డారని, పసుపు నాణ్యత లేదని వంక చూపుతూ తక్కువ ధర చెబుతూ ముంచుతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కొనడం లేదని, ఈ క్రమంలో దిక్కు తోచక వ్యాపారులు చెప్పిన రేటుకే పసుపు విక్రయించి కన్నీటితో తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు.

**అధికారుల నిర్లక్ష్యం..**

బాగా ఎండిన పసుపునకు కూడా నాణ్యత లేదని ధర కోట్ చేయడం లేదని తెలిపారు. మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన పసుపును వారమైనా ఎందుకు కొనడం లేదని అధికారులను అడిగితే, నాణ్యత లేదని వ్యాపారులంటున్నారని, వారు కొనకపోతే తామేం చేయగలమని అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వందల కుప్పల పసుపు ఉన్నప్పటికీ, ఒకటి రెండు కుప్పలను మాత్రమే పరిశీలిస్తున్నారని తెలిపారు. పూర్తిస్థాయిలో పసుపు పరిశీలించకుండానే నాణ్యత లేదనే వంకతో కొనడానికి ఎవరూ ముందుకు రావట్లేదన్నారు. అసలే పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని.. రోజుల తరబడి మార్కెట్ యార్డులో ఉండడంతో అదనపు భారం పడుతున్నదన్నారు.

**దయ చూపాలని వేడుకోలు..**

ఆందోళనకు దిగిన రైతులతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు వచ్చి అన్నదాతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, కలెక్టర్ వచ్చే వరకూ తాము కదిలేది లేదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. పచ్చి పసుపును మార్కెట్‌కు తీసుకొస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారని ఆయన తెలుపడంతో ఒకసారి మార్కెట్‌యార్డుకు వచ్చి పసుపును పరిశీలించాలని అన్నదాతలు కోరారు. ఆయన అంగీకరించడంతో ఆందోళన విరమించిన రైతులు ర్యాలీగా మార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడ పసుపు ఉత్పత్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్‌తో రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. బాగా ఎండిన పసుపు కొమ్ములను చూపుతూ ఇంతకంటే నాణ్యత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. మీకు దండం పెడతాం. మాకు గిట్టుబాటు అయ్యేలా చూడాలని వారు వేడుకున్నారు. దీంతో సరైన ధర వచ్చేలా చూస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



పోలీసులతో తమ గోడును వెల్లబోసుకుంటున్న రైతులు

**నిండా ముంచుతుండ్రు..**



పసుపు పండించుడంటే మాటలు కాదు. తొమ్మిది నెల్లు కాయలే. మస్తు శ్రమ జేయాలే. ఎండనక, వాననక చిన్నపిల్లలను ఇం ట్ల ఇడుస వెట్టి పసుపు పండించినం. కష్టానికి దగ్గ ఫాయిదా అత్తదని మార్కెట్లకు అత్తే ఏమున్నది. నిండా ముంచుతుండ్రు. పసుపు కొమ్ము దగ్గరికి అచ్చి సూసేటోడు లేడు. కొనేటోడు లేడు. గింత అధ్వానంగా ఎప్పుడు లేకుండే. పదిహేను వేల ధర అయిన ఇయ్యుండ్రి.. లేకుంటే ఇంత పురుగుల మందు అయిన తెచ్చియ్యుండ్రి.

**- లక్ష్మి, పసుపు రైతు, కోమన్‌పల్లి**

**బోర్డు వచ్చి ఏం ఫాయిదా?**



ఎలక్షన్లకు ముందు కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ప్రకటిస్తే సంతోషమేసింది. చైర్మన్‌ను నియమించుడుతోని ఇగ మా కష్టాలు పోయినయ్. మంచి ధర అత్తదని మురిసి పోయినం. పసుపు తీస్కోని మార్కెట్‌కు వస్తే ఈడ ఏం పాడైంది. మద్దతు ధర కాదు గదా. కనీసం పసుపు కొనేటోడే లేకుండా పోయిండు. బోర్డు అచ్చి ఏం ఫాయిదా పాడైంది. మార్కెట్ల ఏం జరుగుతున్నదని ఒక్కడన్న అచ్చి సూత్తుండా? రైతుల గురించి పట్టించుకుంటుండా? అందుకే కడుపు మండి రోడ్డెక్కినం.

**- మహేందర్‌రెడ్డి, పసుపు రైతు, వాడి**

## స్పందించారు.. సమస్య పరిష్కరించారు..

### కల్లూర్‌లో నీటి సమస్య పరిష్కారం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పొతంగల్, మార్చి 10: మండలంలోని కల్లూర్‌లో గ్రామస్తులు కొన్నిరోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుళాయిలకు నీటి సరఫరా నిలిచి పోవడంతో బిందెడు నీళ్ల కోసం నానా అవస్థలు పడుతున్నారు. గ్రామస్తుల తాగునీటి ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'కల్లూర్‌లో నీటి సమస్య' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్నీ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రాజశేఖర్ రెడ్డి, ధన్‌రాజ్ కల్లూర్ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని నీటి సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి పైపు లైన్‌లో ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు చేయించారు. నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని గ్రామస్తులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ కుళాయిలను తొలగించడంతో ఈ సమస్య మొదలైందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## పది వే బిల్లులు.. వందల సంఖ్యలో ట్రిప్పులు

- బట్టాపూర్, భీమ్‌గల్‌లో ఆగని ఇసుక దందా
- అనుమతుల పేరిట అక్రమ రవాణా
- పట్టించుకోని సంబంధిత అధికారులు



బట్టాపూర్ పెద్ద వాగులో ఇసుక ట్రాక్టర్లు



వేబిల్లుపై 7వ తేదీ ఉండగా 10వ తేదీగా మార్చుకున్న అక్రమార్కులు

మోర్తాడ్/ఏర్గట్ల, మార్చి 10: బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక దందా ఆగడంలేదు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణా కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడంలేదు. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ వాగు, ఏర్గట్ల మండలం బట్టాపూర్ పెద్దవాగులో ఇసుక తవ్వకాలు కొనసాగుతునే ఉన్నాయి. అధికార పార్టీ అండదండలు, అధికారుల సహకారంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అవసరానికి మించి వే బిల్లులు తీసుకొని రహస్య ప్రదేశాల్లో డంపులు చేస్తున్నారు. రాత్రి సమయంలో ఇతరప్రాంతాలకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో వేబిల్లులు ఉంటే వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన వే బిల్లులకు, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల సంఖ్యకు ఎక్కడా పొంతన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**అనుమతుల పేరిట అక్రమ రవాణా**

అనుమతుల పేరుమీద ఇసుక అక్రమ రవాణాకు తెరలేపుతున్నట్లు తెలుస్తున్నది. భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ వాగు నుంచి, ఏర్గట్ల మండలం బట్టాపూర్ పెద్దవా గు నుంచి ఇదే తరహాలో ఇసుక దోపిడీ జరుగుతున్నట్లు సమాచారం. తీసుకునే వే బిల్లులు కొన్ని ఉండగా.. ఇసు క తరలింపు వాహనాలు మాత్రం ఎక్కువ సంఖ్యలో ఉంటున్నాయి. అధికారులకు తెలిసే ఈవ్యవహారం కొనసాగుతున్నదని, అందుకు వారికి కూడా భారీగానే ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జేసీబీతో ఇసుక అక్రమ తవ్వకాలకు అనుమతులిచ్చిన ఏ ఒక్క అధికారిపై కూడా జిల్లా అధికారులు చర్యలు తీసుకోలేదు. బట్టాపూర్ పెద్ద వాగులో ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో హైదరాబాద్ నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చినా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో ఇసుక దందా కొనసాగుతుండడంతో అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బట్టాపూర్ గ్రామం లో వీఆర్‌ఏ వేబిల్లులపై డేట్, ట్రాక్టర్ నంబర్లు మారుస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.భీమ్‌గల్, ఏర్గట్ల మండలాల్లో ఇసుక దందాపై విచారణ చేపడితే వాస్తవాలు బయటపడుతాయని ప్రజలు అంటున్నారు. వేబిల్లులు ఇచ్చే తీరుపై కూడా విచారణ జరిపించాలనే డిమాండ్ వినబడుతున్నది. వే బిల్లులపై ఏర్గట్ల తహసీల్దార్ శ్రీలతను వివరణ కోరగా.. సోమవారం 80 వే బిల్లులను జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వే బిల్లులు జారీ చేస్తున్నామని,దీనికి విరుద్ధంగా ఎవరైనా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అల్ప్రాజోలం అమ్మితే ఆస్తులు జప్తు

- ఎంతటి వారైనా ఉపేక్షించబోం
- ఇసుక, మొరం అక్రమ తవ్వకాలను నిరోధిస్తాం
- నూతన సీపీ సాయి చైతన్య



సీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సాయి చైతన్య

నిజామాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిషేధిత అల్ప్రాజోలం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ నూతన పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య స్పష్టం చేశారు. అక్రమ వ్యవహారాల్లో తలదూర్చే వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. అల్ప్రాజోలం వంటి నిషేధిత మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారి ఆస్తులు జప్తు చేసే అధికారం పోలీసులకు ఉన్నదని తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారెవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. సోమవారం నిజామాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సాయిచైతన్య మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ మొదటి ప్రాధాన్యమని వెల్లడించారు. మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సీపీగా రాక మునుపు నార్కొటిక్స్ విభాగంలో పని చేసిన అనుభవాన్ని జోడించి నిజామాబాద్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం పాటుపడతానన్నారు. గతంలో నిజామాబాద్‌లో తానే స్వయంగా దాడులు నిర్వహించి అల్ప్రాజోలం పట్టుకున్నట్లు తెలిపారు. భూ కబ్జాలు, రౌడీ షీటర్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పారదర్శకంగా, అత్యంత కచ్చితత్వంతో పోలీసుల సేవలు అందుతాయన్నారు. డ్రగ్ ఫ్రీ నిజామాబాద్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

**ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం..**

సహజ వనరుల దోపిడీని నివారించేందుకు కఠినంగా వ్యవహరిస్తామని, ఇసుకను అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. సైబర్ నేరాల నుంచి ప్రజలను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు.


- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన పలువురు పోలీసులు
- అనేక అవినీతి, అక్రమాల్లో పాత్రధారులు
- విచ్చలవిడిగా ఇసుక, మొరం దందా
- పట్టపగలే దొంగతనాలు, రాత్రుల్లో నిఘా కరువు
- రెండు జిల్లాల్లో పెరుగుతున్న నేరాలు..

## కొత్త బాస్‌లకు సవాలే!

ఉమ్మడి జిల్లాలో కట్టు తప్పిన ఖాకీలు

**ఖాకీలు** కట్టు తప్పారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయారు. ఇప్పటికే పలువురు ఎస్సైలు, సీఐలు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మరోవైపు, రెండు జిల్లాల్లో ఇసుక, మొరం వంటి సహజ సంపద విచ్చలవిడిగా దోపిడీకి గురవుతున్నది. పోలీసుల సహకారంతో అక్రమ దందా దర్జాగా నడుస్తున్నది. పట్టపగలే చోరీలు, పెరుగుతున్న నేరాలు పోలీసు శాఖకు చెడ్డ పేరు తెచ్చి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పి.సాయిచైతన్య, కామారెడ్డి ఎస్పీగా రాజేశ్ చంద్ర నియమితులు కావడం, సోమవారం వారు బాధ్యతలు స్వీకరించడంతో అక్రమాలకు కళ్లెం పడుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. అయితే, ఉమ్మడి జిల్లాలో పాతుకుపోయిన ఇసుక, మొరం మాఫియా ఆగడాలను అడ్డుకోవడం, గుట్కా, గంజాయితో పాటు అల్ప్రాజోలం నిషేధిత మత్తు పదార్థాల సరఫరాను నియంత్రించడం పోలీస్ బాస్‌లకు సవాల్‌గా మారనున్నది.

–నిజామాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



నిజామాబాద్ సీపీ సాయి చైతన్య | కామారెడ్డి ఎస్పీరాజేశ్‌చంద్ర

**ఉమ్మడి** జిల్లాలో కొందరు పోలీసులు బరి తెగించారు. అక్రమార్కుల ఆట కట్టాల్సిన వారే వారితో చేతులు కలిపి అవినీతికి తెర లేపారు. ఇసుక, మొరంతో పాటు ఇతర అక్రమ దందాల ద్వారా భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఏసీబీకి చిక్కారు. కోటగిరి ఎస్సై రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి పోయాడు. లింగంపేట ఠాణాలో రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఎస్సైలు లంచం తీసుకుంటూ పట్టుబడడం.. ఉమ్మడి జిల్లాలో పోలీసు పనితీరుకు అద్దం పట్టింది. న్యాయం కోసం వచ్చే వారి నుంచి కొందరు ఎస్సైలు, సీఐలు భారీగా వసూళ్లకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. అసాంఘిక శక్తులతో కొమ్ము కాస్తూ దందాలు నిర్వహించడం కూడా ఈ మధ్య కాలంలో టాస్క్‌ఫోర్స్ విభాగంలో నిజామాబాద్‌లో వెలుగు చూసింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేస్తూ ఒక అధికారి భారీగా వసూళ్లకు ఎగబడటాన్ని 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో బట్టబయలు చేయగా డీజీపీ స్పందించి సదరు అధికారిపై వేటు వేశారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిఘా వర్గాల సమాచారం మేరకు ఇసుక దందాకు సహకరిస్తున్న పది మంది ఎస్సైలు, ఇద్దరు సీఐలపై చర్యలు తీసుకోవాలని స్వయంగా డీజీపీ ఆదేశాలు జారీ చేయడం పోలీసుల అవినీతి పర్వానికి సాక్ష్యంగా నిలిచింది. మరికొందరు పోలీసులు క్రమశిక్షణ తప్పారు. ఇందల్వాయి ఠాణాలో ఓ మహిళతో అక్రమ వ్యవహారాలను నడిపి ఎస్సై వివాదాస్పదమయ్యారు. ఇక, కామారెడ్డి శివారులోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఎస్సై, కానిస్టేబుల్, మరో వ్యక్తి చనిపోయిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఓ గిరిజన వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. తరుచూ చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు వెలుగు చూస్తుండగా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సంకట పరిస్థితికి తోడుగా మితిమీరిన రాజకీయ ప్రమేయం మూలంగా నిజామాబాద్ సీపీ, కామారెడ్డి ఎస్పీలు సవాళ్లను ఎదుర్కోవడం కత్తి మీది సాములా మారనున్నది.

**మంజీరాలో బహిరంగంగానే దోపిడీ..**

మంజీరా పరీవాహక ప్రాంతమైన బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ఇసుక, మొరం దోపిడీకి అడ్డే లేకుండా పోయింది. టీజీఎండీసీ నుంచి అనుమతి లేకపోయినప్పటికీ స్థానిక పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల సహకారాలతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తున్నారు. బిచ్కుంద, బీర్కూర్ మండలాల్లో మంజీరా నదికి ఇరు వైపులా సాగుతున్న ఇసుక దందాలో పోలీసులే ప్రత్యక్ష పాత్రధారులుగా నిలుస్తున్నారని ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతోనే ఇదంతా జరుగుతున్నదని ప్రచారం జరుగుతున్నది. వే బిల్లులు లేకుండానే ట్రాక్టర్లలో భారీగా ఇసుక తరలి వెళ్తున్నది. రాత్రి వేళ టిప్పర్లు, లారీల్లో మంజీరా ఇసుకను కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మంజీరా పరీవాహకంలో ఇసుక మాఫియా బలంగా వేళ్లూనుకున్నది. అడ్డం వచ్చిన వారిని బెదిరింపులకు పాల్పడటంతో పాటు దురుసుగా ప్రవర్తిస్తున్న ఘటనలున్నాయి. కొత్తగా వచ్చిన కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ వ్యవహారాలపై దృష్టి సారించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

**సీఎం ఆదేశాలకూ దిక్కులేదు..**

ఇసుక అక్రమాలను సహించేది లేదన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ మేరకు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. కానీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇసుక అక్రమాలకు మాత్రం ఎక్కడా కళ్లెం పడలేదు. సీఎం ఆదేశించినప్పటికీ, రాత్రి, పగలు తేడా లేకుండా చాలాచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇందులో సూత్రధారులకు పోలీసులే అండగా నిలుస్తున్నారని ఆరోపణలున్నాయి. బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొడుతున్నారు. మొన్నటి వరకూ జీరో దందా నడపగా, ఇప్పుడు ఏకంగా వే బిల్లుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. తహసీల్దార్ల నుంచి దొంగ వే బిల్లులు, వాడి పాడేసిన పాత బిల్లులతో విచ్చలవిడిగా ఇసుక తరలిస్తున్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ల ముందు నుంచే ఇసుక అక్రమ తరలింపు జరుగుతున్నా అడ్డుకునే వారే లేరు. ఐదున్నర నెలలుగా జిల్లాకు పూర్తి స్థాయి సీపీ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది కొందరు అడ్డే లేకుండా వ్యవహరించారు. అయితే, నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించడంతో ఇసుక అక్రమార్కుల భరతం పట్టేందుకు పోలీసులు నడుం బిగిస్తారని జనం ఆశిస్తున్నారు.

## ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

**కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర**



పట్టణ పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న నూతన ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి, మార్చి 10: జిల్లా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, మహిళల రక్షణ తమకు అత్యంత ప్రాధాన్య అంశమని కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన సోమవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారన్నారు. చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారిస్తారన్నారు. అనంతరం కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. అక్కడ పని చేస్తున్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించారు. ఏఎస్పీ చైతన్యారెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.